సాక్షి

# పాతబస్తీలో జోరుగా మెట్రో పనులు

చార్మినార్: పాతబస్తీలో మెట్రో పనుల్లో వేగం పెరిగింది. దారుషిఫా నుంచి మొఘల్‌పురా వరకు ప్రధాన రోడ్లలోని ఇరువైపుల పురాతన కట్టడాలను సైతం తొలగిస్తున్నారు.

- మెట్రో పనులను ఆపాలంటూ హైకోర్టులో పిల్
- పురాతన కట్టడాలకు ఆటంకాలు కలిగే అవకాశం అంటూ పిల్
- తదుపరి విచారణ ఈ నెల 17 కు వాయిదా వేసిన హైకోర్టు
- సీఎం ఆదేశాల మేరకు... చకచకా కూల్చివేతలు
- ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు వేగంగా మెట్రో పనులు



ప్రస్తుతం నిరంతరాయంగా ఈ కూల్చివేతల పనులు కొనసాగుతున్నాయి. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే పాతబస్తీలో మెట్రో పనులు ప్రారంభమవుతాయని కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉండి వెంటనే పనులను ప్రారంభించాలని మెట్రో ఎండీకి చెప్పడం.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ జరగడం.. నిధులను కేటాయించడం.. శంకుస్థాపన చేయడంతో కూల్చివేతలు చకచకా జరిగిపోతున్నాయి. దీనికి తోడు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో పాటు మజ్లిస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీలు కూడా పాతబస్తీలో మెట్రో రైలు పనులను వెంటనే చేపట్టాలని కోరడంతో రోడ్డు విస్తరణ పనులు మొదలై జోరుగా కొనసాగుతున్నాయి.

### పురాతన కట్టడాలకు నష్టం కలుగుతుందంటూ పిల్..

దారుషిఫా నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టిన కూల్చితలలో చరిత్రాత్మకమైన కట్టడాలున్నాయని.. మెట్రో కూల్చివేతలతో వాటికి ముప్పు వాటిల్లనుందని.. వాటిని పరిరక్షించిన అనంతరమే కూల్చివేతలు కొనసాగించాలని కోరుతూ ఆక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్(ఏపీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది.

◆ చార్మినార్ నుంచి ఫలక్‌నుమా వరకు జరిగే మెట్రో రైల్ ఫేజ్–2 కూల్చివేతల్లో హెరిటేజ్ కట్టడాలున్నాయంటూ ఫౌండేషన్ అధ్యక్షులు మహ్మద్ రహీం ఖాన్ హైకోర్టులో వేసిన తన పిల్ ద్వారా వివరించారు. తెలంగాణ హెరిటేజ్ ఆక్ట్ 2017తో పాటు ఆన్‌సెంట్ మానుమెంట్స్ అండ్ ఆర్కియాలజికల్ సైట్స్ అండ్ రిమేన్స్(ఏఎంఏఎస్ఆర్) ఆక్ట్ 1958 ప్రకారం ముందుగా హైకోర్టు



మెట్రో రైలు కోసం పురానీహవేలీ చౌరస్తాలో కొనసాగుతున్న కూల్చివేతలు

గానీ నిపుణుల బృందంతో గానీ సర్వే నిర్వహించి రిపోర్టు వచ్చేంత వరకు ప్రస్తుతం జరుగుతున్న కూల్చి వేతలను నిలిపివేయాలని కోరారు.

◆ పురానీహవేలీ, అజాఖానా–ఇ–జహ్రా,జమా మసీద్, దారుషిఫా, మొఘల్‌పురా తదితర హెరిటేజ్ కట్టడాలకు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ వీటి పరిస్థితి ఏమిటంటూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుకా యారా తదితరుల డివిజన్ విచారణ చేపట్టి తదుపరి విచారణను ఈనెల 17వ తేదీకి వాయిదా వేసింది.

### ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు..

ఫలక్‌నుమా నుంచి ఎంజీబీఎస్ ద్వారా సికింద్రాబాద్ జేబీఎస్ వరకు ఉండే ఈ మెట్రో కారిడార్ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అయితే ఇప్పుడు ఫలక్‌నుమా వరకు కాకుండా చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్‌ను పొడిగించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టకేలకు పురానీహవేలీ, మీరాలం మండి, దారుషిఫా, ఎతేబార్ చౌక్, శాలిబండ, శంషీర్‌గంజ్ ద్వారా ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు మెట్రో పనులు వేగంగా జరుగనున్నాయి.

◆ ఇందులో భాగంగా ప్రస్తుతం దారుషిఫా నుంచి మొగల్‌పురాలోని బీబీబజార్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలను తొలగిస్తున్నారు. ప్రస్తుతం పురానీహవేలీ చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. చాంద్రాయణగుట్ట నుంచి ఆర్జీఐఏ వరకు మెట్రో కారిడార్ కొనసాగనుంది.

### గ్రేటర్‌లోని అన్ని కారిడార్లలో లాగే పాతబస్తీలో సైతం..

గ్రేటర్‌లోని అన్ని కారిడార్లలో పరుగులు తీసినట్లే.. ఇక నుంచి పాతబస్తీలో కూడా మెట్రో రైలు పరుగులు తీయనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన పాతబస్తీ ప్రజల కళ నెరవేరే రోజు వచ్చేసింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటోంది. ఎట్టకేలకు మెట్రో కోసం ఎదురు చూసిన పాతబస్తీ ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2వేల కోట్ల వ్యయంతో ఫలక్‌నుమాలో మెట్రో పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

◆ సీఎం ఆదేశాల మేరకు పాతబస్తీలో నిర్మించనున్న మెట్రో కోసం రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. ప్రత్యేక తెలంగాణ వచ్చినప్పటి నుంచి రెండు సార్లు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో... ఇక పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులకు మోక్షం కలుగుతుందని భావించిన పాతబస్తీ ప్రజల ఆశలు నెరవేరుతున్నాయి. ఇక, హెరిటేజ్ కట్టడాల పరిరక్షణ పేరుతో హైకోర్టులో పిల్ దాఖలు కావడంతో అందరి దృష్టి హైకోర్టు పై పడింది.